
సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం : 24 : ఏప్రిల్ : 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



పతకాల పంట

జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించారు. 8లో ▸



విలువైన వస్తువులు స్వాధీనం

జిల్లాలో ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి నిర్వహించిన తనిఖీల్లో రూ.1.11 కోట్ల విలువైన నగదు, వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

ప్రచారంలో ఫ్యాను జోరు

పోలింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ అధికార వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో మరింత జోరు పెంచింది. పార్టీ అభ్యర్థులు ఇంటింటా ప్రచారాలు, ఆత్మీయ సమావేశాలతో ప్రజలతో మమేకమవుతున్నారు. సీఎం జగన్ పాలనలో కనీవినీ ఎరుగని విధంగా, అవినీతికి తావులేకుండా జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తున్నారు. ప్రజారంజక పాలన కొనసాగింపునకు మరోసారి సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్నారు. సంక్షేమ సారథి జగన్‌కి ప్రతినిధులుగా తమ గ్రామాలకు వస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలకు బ్రహ్మరథం పడుతున్నారు. పూలవర్షం కురిపిస్తూ మంగళహారతులతో స్వాగతం పలుకుతున్నారు. విజయులై తిరిగి రావాలంటూ ఆశీర్వదిస్తున్నారు. నియోజకవర్గాల్లో అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు చేస్తున్న ప్రచారానికీ ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది.

– సాక్షి, భీమవరం



తాడపల్లిగూడెం నియోజకవర్గం మెట్ట ఉప్పరగూడెంలో ప్రచారం చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

విజయమే లక్ష్యం

- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- సీఎం జగన్ పాలనలో జరిగిన మేలును వివరిస్తూ ముందుకు
- ప్రజారంజక పాలన కోసం మరలా గెలిపించాలంటూ అభ్యర్థన
- గ్రామగ్రామాన పార్టీ అభ్యర్థులకు బ్రహ్మరథం
- అపూర్వ స్వాగతం పలుకుతున్న ప్రజలు



భీమవరంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

సామాజికవర్గాలకు అతీతంగా మద్దతు

నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, ఉండి, ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో కలిసి ర్యాలీలు, ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటున్నారు. నరసాపురం లోక్‌సభ స్థానం చరిత్రలో ప్రధాన పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తొలి బీసీ మహిళగా గుర్తింపు పొందిన ఉమాబాలకు సామాజిక వర్గాలకు అతీతంగా మద్దతు లభిస్తోంది. ప్రచారంలో ఆమెను ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు.

ఆత్మీయ సమావేశాల్లో మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ఆత్మీయ సమావేశాల ద్వారా ప్రజలతో మమేకమవుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందరరావు తదితరులతో కలిసి స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ పేరిట పట్టణంలోని వార్డుల్లో ప్రచారం చేస్తున్నారు. అలాగే తాడేపల్లిగూడెం టౌన్, రూరల్, పెంటపాడు మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరోమారు గెలిపించాలని కోరుతున్నారు. గ్రామగ్రామాన ఆయన ప్రచారానికి అపూర్వ స్పందన వస్తోంది. మంత్రి కుమారుడు కొట్టు బాలరాజేష్, కుమార్తె కంచన్ పట్టణంలోని వార్డుల్లో ప్రచారం చేస్తున్నారు.

ప్రచార పర్వం

వినూత్న రీతిలో కారుమూరి



తణుకు నియోజకవర్గంలో రైతులకు సాయం చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు నియోజకవర్గంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇప్పటికే ప్రజాదీవెన యాత్ర ద్వారా నియోజకవర్గాన్ని చుట్టేశారు. సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. తణుకు పట్టణంతో పాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో పొలాల్లోకి వెళ్లి రబీ పనులు చేస్తున్న రైతులను కలుస్తున్నారు. ధాన్యం బస్తాలు మోయడంతో పాటు యంత్రంతో పంట కోత కోస్తూ రైతులను ఆకట్టుకున్నారు. ఆయనకు మద్దతుగా భార్య లక్ష్మీకిరణ్, కుమార్తె దీపిక, అల్లుడు దిలీప్‌కుమార్ ప్రచారం చేస్తున్నారు.

చెరుకువాడకు ఇంటింటా ఆత్మీయ స్వాగతం



ఆచంట నియోజకవర్గంలోని పోడూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు ప్రచారంలో ఘన స్వాగతం లభిస్తోంది. పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ఇప్పటికే పలుసార్లు ఆయన ప్రతి ఇంటినీ సందర్శించారు. తాజాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటా ప్రచారంలో ప్రజలను పలకరిస్తూ ఆకట్టుకుంటున్నారు. తనయుడు నరేష్‌రాజు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

దూసుకుపోతున్న ప్రసాదరాజు



నరసాపురం నియోజకవర్గంలో పాతపాడులో చీఫ్ విప్ ప్రసాదరాజును ఆశీర్వదిస్తున్న మహిళ

నరసాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నరసాపురం టౌన్, రూరల్, మొగల్తూరు మండలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజారంజక పాలన కొనసాగింపు కోసం మరలా వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఆయన కోరుతున్నారు. ఎమ్మెల్యే ప్రసాదరాజుకు వాడవాడనా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్నారు.

పాలకొల్లులో ప్రత్యర్థికి బెంబేలు



పాలకొల్లు నియోజకవర్గం పాలకొల్లులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లులో పార్టీ అభ్యర్థి గుడాల గోపి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలోని వివిధ సంఘాల ముఖ్య నేతల మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇప్పటికే పాలకొల్లు టౌన్, రూరల్, యలమంచిలి, పోడూరు మండలాల్లో చాలా వరకు ప్రచారం పూర్తి చేసుకున్నారు. ఆప్యాతాతలను అప్యాయంగా పలకరిస్తూ, సీఎం జగన్ పాలనలో జరిగిన మేలును వివరిస్తూ ప్రత్యర్థి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నారు. ఆయనతో పాటు భార్య మంగతాయారు, కుమారుడు సాయిబాలాజీ ప్రచారంలో పాల్గొంటున్నారు.

భీమవరంలో చేరికల వెల్లువ



భీమవరం నియోజకవర్గంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. భీమవరం పట్టణం, రూరల్, వీరవాసరం మండలాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూన్నారు. భీమవరానికి జిల్లా కేంద్రం తీసుకురావడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషిని వివరిస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నారు. గత నెల రోజుల్లో భారీ ఎత్తున టీడీపీ, జనసేన పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలను చేర్చుకోవడం ద్వారా కూటమిని బెంబేలెత్తిస్తున్నారు.

ఉండిలో పీవీఎల్‌కు జనాదరణ



ఉండి నియోజకవర్గంలోని కొండేపూడిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు

ఉండిలో అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన భారీ ర్యాలీలకు పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి మద్దతు తెలిపారు. మండల స్థాయిలో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేసి సీఎం జగన్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. పీవీఎల్‌కు ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సోదరుడు పెనుమత్స గోపాలకృష్ణంరాజు పీవీఎల్ విజయానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

తప్పుడు స్క్రిప్టులు చదివి బఫూన్ అవుతున్నావ్ పవన్

అప్పుడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: 'చంద్రబాబు రాసిచ్చిన తప్పుడు స్క్రిప్టులు చదివి బఫూన్ అవుతున్నావ్ పవన్ కళ్యాణ్.. నువ్వు చెప్పే మాటలు విని ఆక్వా రైతులు నవ్వుకుంటున్నారు. నమ్మక ద్రోహానికి, విశ్వాసఘాతానికి ప్రతిరూపమైన చంద్రబాబు నిన్ను అథఃపాతాళానికి తొక్కేయాలని రచించిన స్క్రిప్టులో భాగంగా జరిగిన కుట్రకు బలవుతున్నావ్.. ముందు ఆ విషయాలు తెలుసుకోకుండా ఆక్వా రంగం గురించి అవాస్తవాలు మాట్లాడటం తగదు పవన్..' అని అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆక్వా రైతులకు సబ్సిడీలు ఇవ్వడంతోపాటు మేత, రొయ్య కొనుగోలు ధరలను స్థిరీకరించినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని చెప్పారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు యూనిట్‌కు రూ.1.50 మాత్రమే విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అది కూడా తెలియకుండా యూనిట్‌కు ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారని చెబితే నవ్వకుండా ఎవరైనా ఉంటారా పవన్.. అని ప్రశ్నించారు. రైతుల అవసరాల కోసం విశాఖ జిల్లాలో క్వారంటైన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతులకు ఇప్పటివరకు సబ్సిడీ ద్వారా రూ.3,600 కోట్లు ఇచ్చామన్నారు. ఫీడ్ యాక్టు తీసుకొచ్చి సీడ్, ఫీడ్ ధరలను ఎప్పటికప్పుడు నియంత్రిస్తున్నామని వివరించారు. చెరువుల లీజు ధరలను తగ్గించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆక్వాకు సంబంధించి అన్ని విషయాలను రైతులు తెలుసుకునేలా యాప్‌ను రూపొందించామని తెలిపారు. దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఆక్వా రైతులు ఆనందంగా ఉన్నారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతుల పరిస్థితి ఏమిటీ.. ఇప్పుడు ఏమిటనే వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని పవన్ కళ్యాణ్‌కు రఘురాం హితవుపలికారు. తాను ముఖ్యమంత్రిని అవుతానని చెప్పిన పవన్... చంద్రబాబు ట్రాప్‌లో పడి 24 శాతం కాపు జనాభా ఉన్నప్పటికీ, దామాషా పద్ధతిలో అయినా కనీసం 24 సీట్లు తీసుకోలేకపోయారని చెప్పారు. పొత్తు పేరుతో జనసేన తీసుకున్న 21 సీట్లలో కూడా 11 సీట్లను వేరే పార్టీల నుంచి వచ్చినవారికి ఇచ్చేశారని, పది సీట్లతో ముఖ్యమంత్రి అవుతావా పవన్‌కళ్యాణ్... అని రఘురాం ప్రశ్నించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ పోలా భాస్కర్

తణుకు టౌన్: విద్యారంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి బోధన, బోధనేతర కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులను మరింత నైపుణ్యం గల నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉన్నత విద్యలో అంతర్జాతీయ నైపుణ్యాలను పెంపునకు ఎడెక్స్ వంటి కోర్సులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఇంటర్న్‌షిప్‌లు ఉండాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి హైదరాబాద్ ఇష్టు సహకారంతో డిగ్రీ విద్యార్థులకు మూడు, నాలుగు సెమిస్టర్లలో పోటీ పరీక్షల్లో వచ్చే ఇంగ్లిష్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. కళాశాలలో సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాంతీయ విద్యా డైరెక్టర్ ఎస్.శోభారాణి, ప్రిన్సిపాల్ పి.అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ ఉన్నారు.

పక్కాగా తాగునీటి సరఫరా

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తాగునీరు, విద్యుత్తు సరఫరా, జాతీయ ఉపాధి హామీ పనులను పక్కాగా అమలు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, కూలీలకు ఉపాధి కల్పన, వేసవిలో విద్యుత్ సరఫరా తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం: భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి రేయింబవళ్లు కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాత్రి భీమవరం త్రీటౌన్‌లోని ఫోర్ సీజన్, ఎస్ఎల్‌వీ టవర్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004–2009 వరకు, 2019–2024 వరకు భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించానన్నారు. 2053వ సంవత్సరం లక్ష్యంగా పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని అమృత్ పథకంలో రూ.48 కోట్ల నిధులతో ప్రణాళిక అమలుకు అడుగులు వేశామన్నారు. కోటి లీటర్ల మంచినీటి సామర్థ్యాన్ని రెండు కోట్ల 70 లక్షల లీటర్ల వరకు పెంచామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా 24 గంటలపాటు తాగునీటి సరఫరా లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెన నిర్మాణాలకు రూ.38 కోట్ల నిధులను మంజూరు చేయించామన్నారు. నియోజకవర్గంలో సుమారు 15 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. ఇలా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నానని, వచ్చే నెల 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో తనకు పూర్తి స్థాయిలో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, భూపతిరాజు రామరాజు, చింతలపాటి లక్ష్మీ నరసింహరాజు, ఎం.సూరిబాబు, రామకృష్ణ గొట్టుముక్కల రవివర్మ, తోట భోగయ్య, గాదిరాజు రామరాజు, కామన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్లు

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి ఏడుగురు అభ్యర్థులు కొత్తగా నామినేషన్లు దాఖలు చేయగా, ఇప్పటికే నామినేషన్ వేసిన ఒక అభ్యర్థి రెండు సెట్లు, మరో అభ్యర్థి ఒక సెట్ నామినేషన్‌ను సమర్పించారు. బీజేపీ నుంచి భూపతిరాజు శ్రీనివాస వర్మ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్‌కు అందజేశారు. అలాగే బీజేపీ తరఫున కలిదిండి వినోద్‌కుమార్‌వర్మ, స్వతంత్ర అభ్యర్థులుగా మాడపాటి వెంకట వరాహలరెడ్డి, కేత శ్రీను, రామ దుర్గాప్రసాద్, గేదల లక్ష్మణరావు, అద్దేపల్లి వీర వెంకట సుబ్బారావు ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల తరఫున రెండు సెట్లు, గూడూరి జగదీష్‌కుమార్ తరఫున ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. దీంతో నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటివరకు 14 మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలు మినహా మిగిలిన చోట్ల 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. భీమవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గ్రంధి రవితేజ ఒక సెట్టు నామినేషన్ పత్రాలు సమర్పించారు.

ధర్మయుద్ధం చేస్తున్న జగన్‌ను గెలిపించండి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ధర్మయుద్ధం చేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలని, అధర్మ కూటమికి బుద్ధి చెప్పాలని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ తాడేపల్లిగూడెం అసెంబ్లీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక సవిత్రుపేటలో 15వ వార్డు ఇన్‌చార్జి మార్నీడి వెంకటేశ్వరరావు (వెంకన్న) ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ప్రజలే జగన్, జగనే ప్రజలు అన్నట్లుగా వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలన సాగిందన్నారు. ప్రజల ముంగిటకు పాలనను సీఎం జగన్ సమర్థవంతంగా అందించారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నూరు శాతం ఉత్తీర్ణత జగనన్నకు వస్తే.. 650 హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేని అసమర్థుడిగా చంద్రబాబు పేరు సాధించారన్నారు. తాను 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మార్నీడి వెంకన్న చెప్పిన అన్ని విషయాలను నెరవేర్చానన్నారు. అప్పట్లో 330 మందికి ఇళ్లు ఇవ్వాలని వెంకన్న కోరితే అమలు చేశామన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఇప్పటికే 10 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు ఇవ్వగా మరో 1,500 మందికి స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. వీరి కోసం 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సవిత్రుపేట వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన వెంటనే నూరు శాతం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకట మధుసూదనరావు (ఈలి నాని), అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పలు విషయాలను వెల్లడించారు. నాయకులు బొడ్డు సాయిబాబా, కర్రి భాస్కరరావు, పర్వూరి రామారావు, అబ్దుల్ మునీర్, పాలపర్తి రాజా, కొట్టు తాతాజీ, యెగ్గిన గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- ప్రజలకు పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- పలు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం


పోడూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


వేంద్రలో ఓట్లను అభ్యర్థిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పోడూరు: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పిలుపునిచ్చారు. పోడూరులో మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల శంఖారావ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామప్రజలు ఘనస్వాగతం పలికారు. వృద్ధులను, మహిళలను, రైతులను, కూలీలను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఆప్యాయంగా పలుకరించారు. గడిచిన ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేశామన్నారు. ఆచంట నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి చూసి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేయాలని, తనను ఆచంట ఎమ్మెల్యేగా, గూడూరి ఉమాబాలను నరసాపురం ఎంపీగా గెలిపించాలని శ్రీరంగనాథరాజు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, ఏపీసీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, ఎంపీటీసీ సభ్యులు పోడూరి నాగరాజారావు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

పాలకోడేరు : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం కొండేపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టాపులేని వాహనంలో కొండేపూడి నుంచి వేంద్ర, వేంద్ర అగ్రహారం, పాలకోడేరు గ్రామాల్లో పర్యటించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. పీవీఎల్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు సైతం సీఎం వైఎస్ జగన్ అమలు చేశారన్నారు. నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. గతంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు కూటమి పేరుతో మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు నమ్మవద్దన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిందన్నారు. జగనన్న పాలనను చూసి ఓట్లు వేసి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, ఏఎంసీ డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఆదాడ లక్ష్మీతులసి, సోడదాసి నరేష్, బొక్క రాంబాబు, దెందుకూరి వెంకటరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్‌లు చింతపల్లి వెంకటనారాయణ, కడలి నాగేశ్వరి పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదల అభ్యున్నతి సాధ్యం


కోమటితిప్పలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రసాదరాజు

మొగల్తూరు: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నరసాపురం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కోమటితిప్పలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో మహిళలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామంలోని కోమటితిప్ప నుంచి కొత్తోట, జల్లేడుతిప్ప, నీటితిప్ప, జగన్నాథపురం గ్రామాలను కలుపుతూ రూ.9 కోట్లతో రహదారి నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయన్నారు. జిల్లేడుతిప్ప గ్రామంలో ఓహెచ్ఎస్ఆర్ ప్రారంభించామన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామంలోని మాజీ ఎంపీపీ సత్తినేని మోహన్‌రావు, సర్పంచ్ పులపర్తి సూర్యనారాయణలను కలిసి మద్దతు పలకాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు లింగం ఏసుబాబు, మంతెన పాండు, కొత్తోట సర్పంచ్ పడవల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి ఏసుబాబు, అల్లూరి రంగరాజు, చాగంటి సత్యనారాయణ, తోటకూర శివాజీ రాజు, సరిపల్లి సుబ్బరాజు, కొల్లాటి రాంప్రసాద్, తిరుమాని సుబ్బారావు, బర్రి నర్సింహ స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ చిత్రకళా పోటీల్లో పతకాల పంట


చిత్రకళ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో ఉపాధ్యాయులు

తణుకు అర్బన్ : జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు సత్తా చాటి పతకాల పంట పండించారు. ఇటీవల నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ, విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ జాతీయ స్థాయిలో విజయవాడలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి 35 బంగారు, వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి చెప్పారు. విద్యార్థులను, పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయులు వెంపటాపును పాఠశాల సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు కనకదుర్గేశ్వరి, శైలజ ఉమాదేవి, వీరభద్రం, భీమేశ్వరరావు, కేశవశర్మ, పాపారావు, వీరబాబు, సంజయ్ గాంధీ, రాధ, షీలా, సురేంద్రనాథ్ అభినందించారు.

టెన్త్ ఫలితాల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ


కర్రా మంజుహాసిని


పాకలపాటి వైష్ణవి

నరసాపురం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నరసాపురం భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వి.ఆంజనేయులు చెప్పారు. కర్రా మంజుహాసిని 593 మార్కులతో టౌన్‌ఫస్ట్, పాకలపాటి వైష్ణవి 592 మార్కులతో టౌన్ సెకండ్ సాధించినట్టు తెలిపారు. శామంతకుర్తి లక్ష్మీ శ్రావణి 590 మార్కులతో ప్రతిభ చూపించారని చెప్పారు. మొత్తం 97 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా, 88 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు. 590 మార్కులు పైగా ముగ్గురు, 580పైన 9మంది, 570పైన 16 మంది, 560 మార్కులు పైన 20మంది సాధించారు. నూరుశాతం ఉత్తీర్ణతతో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్టు చెప్పారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను, అధ్యాపకులు అభినందించారు.

కాటన్ దొర విగ్రహానికీ ముసుగు

ఎన్నికల వేళ తోకలపూడిలో అధికారుల అత్యుత్సాహం


తోకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి వేసిన ముసుగు

భీమవరం: ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల విగ్రహాల ద్వారా ఓటర్లు ప్రభావితమవుతారని వారి విగ్రహాలకు అధికారులు ముసుగు వేయడం తెలిసిందే. అలాగే నాయకుల విగ్రహాలతోపాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన చోట్ల ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై నాయకుల ఫొటోలకు ముసుగు వేయడాన్ని చూస్తుంటాం. అయితే గోదావరి నదిపై ఆనకట్టలు నిర్మించడం ద్వారా డెల్టా ప్రాంతాలను సస్యశ్యామలం చేసి రైతు బాంధవుడిగా పేరెన్నికగన్న కాటన్ దొర విగ్రహానికి సైతం ఎన్నికల అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ముసుగు వేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. కాటన్ దొరను జిల్లాలో దేవుడితో సమానంగా ఆరాధిస్తారు. అనేకచోట్ల కాటన్ విగ్రహాలు పెట్టి కొలుస్తుంటారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వీరవాసరం మండలం తోలకపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన కాటన్ విగ్రహానికి అధికారులు ముసుగు వేయడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. కాటన్ దొరను కూడా రాజకీయ నాయకుడిగా అధికారులు భావించారా అంటూ పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాటన్ దొర విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని కోరుతున్నారు.

బీజేపీ నామినేషన్‌కు కూటమి నేతల డుమ్మా

- ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు మాత్రమే హాజరు
- మొక్కుబడిగా వచ్చిన జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు
- ర్యాలీ ప్రారంభంలో సైతం పత్తాలేని కూటమి నాయకులు
- కూటమి నేతల మధ్య విభేదాలు బట్టబయలు

భీమవరం: నరసాపురం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ నామినేషన్ వేసే కార్యక్రమానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు ముఖం చాటేశారు. మంగళవారం శ్రీనివాసవర్మ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయడానికి రాగా, ఆయన వెంట ఆచంట, తణుకు టీడీపీ అభ్యర్థులు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ మాత్రమే వెంట ఉండడం చర్చనీయాంశమైంది. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు పోటీ చేస్తుండగా పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీకి చెందిన శ్రీనివాసవర్మ, ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు ఎమ్మెల్యే స్థానాల్లో టీడీపీ, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే స్థానాల్లో జనసేన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పొత్తుల ప్రారంభం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. ప్రధాన నాయకుల మధ్య ఐక్యత కొరవడడంతో కార్యకర్తలు కూడా ఉమ్మడి కార్యక్రమాలకు అంతంతమాత్రంగానే హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీనివాసవర్మ నామినేషన్ ఎంతో అట్టహాసంగా పట్టణ శివారు ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ప్రచారం చేశారు. అయితే ర్యాలీ ప్రారంభ సమయంలో టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులెవరూ కానరాకపోగా టీడీపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు కూడా పత్తాలేరు. అలాగే ర్యాలీలో టీడీపీ, జనసేన జెండాలు కూడా అంతంతమాత్రంగానే కనిపించాయి. అయితే కలెక్టరేట్‌లో నామినేషన్ వేసే సమయానికి ఆచంట, తణుకు టీడీపీ అభ్యర్థులతోపాటు జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాత్రమే హాజరుకావడం గమనార్హం. నరసాపురం ఎంపీ స్థానాన్ని కూటమి ఒప్పందంలో భాగంగా బీజేపీకి కేటాయించి నాటి నుంచి టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. దీంతో బీజేపీ అభ్యర్థికి టీడీపీ, జనసేన ప్రధాన నాయకులు సహకరించడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇటువంటి తరుణంలో నామినేషన్ కార్యక్రమానికి కూడా టీడీపీ, జనసేన నాయకులు పెద్దగా హాజరుకాకపోవడం కూటమి మధ్య విభేదాలున్నాయనే ప్రచారానికి బలం చేకూరింది.

నామినేషన్‌కు వస్తే రూ.300, బైక్‌పై వస్తే రూ.200

బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యే వారికి రూ.300 నగదు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే మోటారుసైకిల్ వేసుకుని వస్తే రూ.200 పెట్రోల్ పోయించారు. దీంతో వీరవాసరం, భీమవరం పట్టణంలోని ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల వద్ద ఉచిత పెట్రోలు కోసం మోటారుసైకిల్ వాహనదారులు క్యూ కట్టారు.

వైఎస్సార్ సీపీలోకి క్యూకట్టిన జనసేన, టీడీపీ నేతలు




ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన బిళ్ల బ్రదర్స్ తదితరులు, ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన యర్రంశెట్టివారిపాలెం గ్రామస్తులు


అదవిపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న గుడాల గోపి


పాలకొల్లు బెత్లహాంపేటలో కొండేటి వరదరాజుల మెడలో కండువా వేసి ఆహ్వానిస్తున్న గుడాల గోపి

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు వెల్లువెత్తుతున్నారు. తాజాగా మంగళవారం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు బిళ్ల కృష్ణమూర్తి కుమారులు బిళ్ల బ్రదర్స్‌గా పిలువబడే బిళ్ల నర్సింహరావు, బిళ్ల అన్నవరం లతోపాటు పలువురు చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ప్రసాదరాజు సమక్షంలో పార్టీ కండువాలను కప్పించుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్ జగన్ పేదరికమే కొలమానంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. యర్రంశెట్టివారిపాలెం గ్రామం పూతినీడివారిపాలెంలో మంగళవారం జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి పెద్ద ఎత్తున చీఫ్ విప్, ఎమ్మెల్యే ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ప్రసాదరాజు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పూతినీడి నరేంద్ర, కట్టాకాశి, ఇళ్ల నరసింహరావు, పితాని పెద్దిరాజు, పితాని వెంకటేశ్వరరావు, తంగెళ్ల మోహనరావు, కడలి వెంకటరత్నం, పాము ఏసేపు, ఇళ్ల వెంకటేశ్వరరావు, చింతప్లి సుమేష్‌రావు, వర్ధనపు పండు తదితరులు ఉన్నారు.

గోపీ సమక్షంలో 50 కుటుంబాల చేరిక


పాలకొల్లు అర్బన్ : పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని 18వ వార్డు బెత్లహాంపేటలో మంగళవారం వరదరాజులు ఆధ్వర్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం జగన్ పాలన నచ్చి, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరిన కారణంగా తనతో పాటు మాదిగ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. గుడాల శ్రీహరి గోపాలరావు పార్టీలో చేరిన 50 కుటుంబాలకు చెందిన యువకుల మెడలో పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.


అడవిపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న గుడాల గోపి

అడవిపాలెంలో..

యలమంచిలి : సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే తెలుగుదేశం, జనసేనతోపాటు ఇతర పార్టీల వారిని వైఎస్సార్ సీపీలోకి ఆకర్షిస్తున్నాయని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రుకు చెందిన తెలుగుదేశం, జనసేన నాయకులు సోమవారం రాత్రి గోపి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గోపి వారందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. గోపి మాట్లాడుతూ త్వరలో ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో ఓటర్లు వైఎస్సార్ సీపీలో చేరతారని గోపి చెప్పారు. పార్టీలో చేరిన వారిలో తంగెళ్ల సంజయరావు, కడలి నాగరాజు, మల్లుల రామారావు, బొక్కా సత్యనారాయణ, బొక్కా పెద్దిరాజు, జక్కంశెట్టి వెంకట్రావు, జక్కంశెట్టి సురేష్, జక్కంశెట్టి రాజేశ్వరరావు, నక్కా శ్రీరాములు, జక్కంశెట్టి శ్రీనివాస్, కటారి శ్రీనివాసరావు, జక్కంశెట్టి రాంపండు, జక్కంశెట్టి కిరణ్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కొమరాడ జనసేన కార్యకర్తలు


పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న గ్రంధి శ్రీనివాస్

భీమవరం: కొమరాడకు చెందిన జనసేన కార్యకర్తలు భారీగా మంగళవారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కురెళ్ళ హేమంత్, సురేష్, సాయి, పవన్, ఆలపాటి మాచిరాజు, ఆముదాలపల్లి వెంకట భాస్కరరావు, పులగం సురేష్, మండా శ్రీధర్, తాళ్లూరి సురేంద్ర కుమార్, ఆనంద కుమార్, సానబోయిన సాయి, కటారి శ్రీను, పసుపులేటి సూరి, సూరిశెట్టి పొలు, గూడపాటి దిలీప్, నారిన కిరణ్ కుమార్ తదితరులున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ రాట్నాల సత్యనారాయణ, బేతాళ సంతోష్, యర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.1.11 కోట్ల విలువైన వస్తువుల స్వాధీనం


సిద్దాంతం వద్ద తనిఖీలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టుల వద్ద, పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.1.11 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ 1.07 కోట్ల విలువైన గృహోపకరణ వస్తువులు, రూ.4 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నాయి. అలాగే ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజిమెంట్ సిస్టమ్) ద్వారా రూ.78.3 లక్షల నగదు సీజ్ చేశారు. ఇందులో రూ.51.60 లక్షలు జిల్లా గ్రీవెన్స్ కమిటీ విచారణ అనంతరం రిలీజ్ చేశారు. మిగిలిన సొమ్మును ఆదాయపు పన్ను శాఖ అధికారుల విచారణ నిమిత్తం అందించారు. అలాగే ఇప్పటివరకు రూ.27.7 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా మొత్తం 161 ఫిర్యాదులు రాగా, ఇందులో 74 ఫిర్యాదులు ఇన్‌వ్యాలిడ్‌గా ఉన్నాయి. మిగిలిన 87 ఫిర్యాదులను పరిష్కరించారు. జిల్లా స్థాయిలో ప్రచారాల కోసం అనుమతులకు 64 దరఖాస్తులు రాగా, వాటిలో ఇప్పటివరకు 40 మంజూరు చేయగా, 14 తిరస్కరించారు, మరో 9 పరిశీలన దశలో ఉన్నాయి. అలాగే నియోజకవర్గ స్థాయిలో 748 దరఖస్తులు రాగా, వాటిలో 686 మంజూరు చేశారు. 41 తిరస్కరించగా, మరో 20 పరిశీలన దశలో ఉన్నాయి.

తనిఖీల్లో రూ.1.62 లక్షల పట్టివేత

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉంగుటూరు చెక్‌పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1,62,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగు అధికారి ఖజావల్లీ చెప్పారు. ఒక వాహనం నుంచి రూ.లక్షా తొమ్మిది వేల 800, మరో వాహనంలో రూ.53 వేలు నగదు తీసుకువెళుతుండగా, పట్టుకున్నట్లు ఆర్వో తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ సభ్యులు ఈ నగదును స్వాధీనం చేసుకుని ట్రెజరీలో జమ చేసినట్లు వివరించారు.

క్లుప్తంగా

భారీ అన్నసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక గొల్లగూడెం కోదండ సీతారామాలయం వద్ద మంగళవారం మూడు వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో రామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు జరిగాయి. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కొరిపల్లి సత్యనారాయణలు స్వామివారికి పూజలు జరిపి అన్న ప్రసాదాలు భక్తులకు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనింకి శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, షణ్ముఖ్, వీర్ల సత్యనారాయణ, నానీ, రామ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నీలాద్రిపురం నారాయణ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత



పి.భవాని (585)



ఎం.సింధుమౌనిక (584)

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి ఫలితాల్లో నీలాద్రిపురం నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల డైరెక్టర్ వాకలపూడి రామచంద్రరావు తెలియజేశారు. అధిక మార్కులు సాధించిన పి.భవాని (585), ఎం.సింధుమౌనిక (584), జి.వర్షతేజస్వీ (582), అంతేగాక 24మంది విద్యార్థులకు 500 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ రామకృష్ణ అభినందించారు.

'పది' ఫలితాల్లో మదర్ మెర్సిల్లా స్కూల్ విజయకేతనం



జి మురళీకార్తీక్

అత్తిలి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్తిలి మదర్ మెర్సిల్లా ఇంగ్లీషు మీడియం స్కూల్ విజయదుందుభి మ్రోగించింది. పాఠశాల నుంచి 58 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 58 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి జి మురళీకార్తీక్ 591 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడని స్కూల్ యాజమాన్యం ప్రకటనలో తెలిపింది. ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థి మురళీకార్తీక్‌తో పాటు ఉత్తీర్ణత సాధించిన మిగిలిన విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో మండలంలో మదర్ మెర్సిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని వారు చెప్పారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- 25న కొట్టు నామినేషన్
- భారీగా సన్నాహాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కొట్టు సత్యనారాయణ ఈనెల 25వతేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. గురువారం నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆర్డీఓ కార్యాలయంలో అందజేస్తారు. నామినేషన్ కార్యక్రమానికి భారీగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయంపై క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతీ వార్డు, గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరై నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు కొట్టు స్వగృహం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి పాదయాత్రగా బయలుదేరతారు. పండుగను తలపించేలా నామినేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డి రాఘురాం, ముప్పిడి సంపత్‌కుమార్, ముత్యాల ఆంజనేయులు, పిశేషులత, బోణం విజయనిర్మల, పత్సమట్ల సావిత్రి, దాసరి హైమావతి, గుండుబోగుల నాగు, రూరల్‌నాయకులు జద్దు హరిబాబు, తమ్మిశెట్టి చుక్కయ్య, నూనె రాధ, పెంటపాడు నాయకులు భావన ధాన్యలక్ష్మి, కైకాల శ్రీనివాసు, కర్రి భాస్కరరావు, చెన్నా జనార్దన్, నల్లిమిల్లి గాంధి రెడ్డి, వీర్ల గోవిందు, సంపతరావు కృషారావు, కారింకి వీర్రాజు, పరిమి తులసీదాస్, చిటికన ప్రసాద్, ములకాల రాంబాబు, కొవ్వూరి విజయ భాస్కరరెడ్డి, తెన్నేటి జగ్జీవన్, దింటకుర్తి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ వెలుగులు



అత్తిలి: గోగులమ్మపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఇరగవరం: కొత్తపాడులో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి శివారు గోగులమ్మపేటలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు సబ్బితి రాజేష్, ఆకుల చినబాబు,కంకటాల సతీష్, బుడితి సుజన్‌కుమార్ పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా సీఎం జగన్

ఇరగవరం: అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు తెలిపారు. మండలంలోని 21గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపాడు గ్రామంలో ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకా లు కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటి అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకులు శ్రీనివాస్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మామిడి శెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ సత్యనారాయణ, సర్పంచ్ బొక్క లక్ష్మీ, శీను, రామా రెడ్డి, అడ్డాల సురేదర్ రెడ్డి, మృత్యుంజయుడు, బొక్క దానయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామా పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకు టౌన్: తేతలిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

తణుకు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సభ్యులు, కార్యకర్తలతో గ్రామంలోని ఇంటింటికి తిరిగి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. తేతలి గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, నాయకులు, దారం శ్రీను, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, కిషోర్, సత్యనారాయణ, మానేపల్లి సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి పాల్గొన్నారు.

జగన్ పాలనలో సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న రవిప్రకాష్

తణుకు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. మంగళవారం సాయంత్రం తణుకు పట్టణ పరిధిలోని పాతవూరులో దళితసేన కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు చీలి మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవిప్రకాష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తణుకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరు ఉమాబాలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ దళితసేన ఇన్‌ఛార్జి దూలపల్లి రాంబాబు, ఉండ్రాజవరం మండల అధ్యక్షులు సిర్రా పవన్, ఇరగవరం మండల అధ్యక్షులు గాలింకి రవితేజ, తణుకు పట్టణ అధ్యక్షుడు కట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలి



జగ్గన్నపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్‌లు కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఎండ తీవ్రతతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం సోమరాజు మాట్లాడుతూ వేసవిలో సమ్మర్ అలవెన్స్‌లు రద్దు చేయడం కూలీలకు నష్టం కలిగించిందన్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. శీలి దానియేలు, కే.రామలక్ష్మి, దూలపల్లి శుభ, కే.ఇందిర, ఎం.లీలావతి, జాలాది రాజేశ్వరి, పంది నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడారు. పోరాటాల ద్వారా ఐకమత్యంగా ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలన్నారు. శీలి వెంకటేశ్వరరావు, గుమ్మళ్ల వెంకట్రావు, సొంగా వీర్రాజు, సుబ్బారావు, చాపల బుజ్జి పాల్గొన్నారు.

యల్లారమ్మ జాతర మహోత్సవం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో యల్లారమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మండపాకలో యల్లారమ్మ ఆలయం వద్ద వివిధ రకాల వాయిద్యాలు, బ్యాండు మేళాలు, గరగ నృత్యాలు, బాణా సంచాల కాల్పులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్ మణికంఠ, గ్రామ సర్పంచ్ జానా వెంకట లక్ష్మీ, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పెంటపాడు: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను, పేరెంట్స్‌ను మండల మానవత సంస్థ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా మానవతా సంస్థ చైర్మన్ మోహనరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంతఓట రామకృష్ణ, మానవత సంస్థ సభ్యులు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, సాంబశివ, శ్రీనివాసరావు మండల మానవత సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: తణుకు మండలం 220 కేవీ దువ్వ–వేమగిరి టవర్ లైన్ వార్షిక మరమ్మతులు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి 9 గంటల వరకు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.